

అడిగింది ఇస్తేనే.. అప్రూవల్

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తేచాలు క్షణాల్లో మీ వాహనాల రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి బదిలీల వరకు ఇట్టే వేళ్లమీద చేసేసుకోవచ్చు. వీటికోసం ఇకపై మీ సమయాన్ని, శ్రమను వృథా చేసుకోవలసిన పనిలేదు. అంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతాయి... ఇదీ కేంద్ర ప్రభుత్వ రవాణా మంత్రిత్వశాఖ చెబుతున్న మాట. దీనికోసమే గతంలో ప్రతి రాష్ట్రానికి ఉన్న యాప్‌లను తొలగించేసి, వాటి స్థానంలో ఈ-వాహన్ అనే యాప్‌ను తీసుకొచ్చింది. దేశంలో ఉన్న వాహనాలకు సంబంధించిన అన్ని సేవలు ఎక్కడైనా పొందేలా, కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లో క్షణాల్లో పూర్తిచేసుకునేలా వెసులుబాటు కల్పించామనేది కేంద్ర ప్రభుత్వ శాఖల మాట. అయితే ఇది కేవలం మాటలకే పరిమితమయింది. పర్యవేక్షణ కొరవడటమో! లేక మామూళ్లకు అలవాటుపడటంవల్లో కానీ, చేతులు తడపకుండా అప్రూవల్ ఇవ్వటానికి ఆ చేతులు రావటం లేదు.



కేంద్రం ప్రవేశపెట్టిన ఇ-వాహన్ యాప్

తెనాలి, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు ఆర్టీఓలు ఆన్‌లైన్ దరఖాస్తులను తొక్కిపెట్టి మరీ, దరఖాస్తుదారులను కార్యాలయాలకు పిలిపించుకుని లంచాలు దండుకున్న తర్వాతే వాటిని ఒకే చేయటం, లేదంటే ఆ కాగితం లేదు... ఈ కాగితం లేదంటూ తిప్పుతూనే ఉన్న పరిస్థితి. చివరకు ఇన్సూరెన్స్ వివరాలు ఆన్‌లైన్‌లోనే కనిపిస్తున్నా, దానికి సంబంధించిన పేపర్ చూపాల్సిందేనంటూ తిప్పిపంపటం వంటివి వీరి వసూళ్లకు పరాకాష్ఠ. చివరకు ఆన్‌లైన్‌లో ఒక్క బటన్ క్లిక్‌తో ఓకే చేయగలిగిన ఈ-కేవైసీ, ఫోన్, ఆధార్ నంబర్‌ల అప్‌డేషన్, మండల, జిల్లాల వివరాల సవరణ వంటివాటినీ వదలకుండా ప్రతి పనికీ రేటు పెట్టేసి దోచేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసిన ఈ-ప్రగతి యాప్ ద్వారా అయితే మొదటి దరఖాస్తు పరిష్కారం చూపాకే రెండో దరఖాస్తు ఓపెన్ అయ్యేది. దీనివల్ల మామూళ్లు అందినా, లేకున్నా దరఖాస్తులన్నీ వరుస క్రమంలోనే క్లియర్ చెయ్యాల్సివచ్చేది. కానీ ఈ-వాహన్ యాప్‌లో ఆ పరిస్థితిలేదు అప్లికేషన్ నంబర్ కొడితే ఓపెన్ అవుతుండటంతో వారికి డబ్బు ముట్టిన దరఖాస్తులను క్లియర్‌చేసి, అందని వాటిని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో నెలల తరబడి ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్ పడిపోతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసినవారు నెలల తరబడి ఎదురుచూసి, చివరకు ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లక తప్పటంలేదు. దీంతో కేంద్రం ప్రతిష్ఠాత్మకగా తీసుకొచ్చిన వాహన్ యాప్ కొందరు వసూళ్ల అధికారులకు వరంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ఆర్టీఓ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ దోపిడీ యథేచ్ఛగా సాగిపోతూనే ఉంది. దీంతో దరఖాస్తుదారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి.


ఈ - వాహన్‌లో వాహనదారుల కష్టాలు

- ఆర్టీవో కార్యాలయానికి వెళ్లకుంటే ఫైల్ కదిలేది లేదు
- ఆన్‌లైన్ సేవలపైనా నిలువు దోపిడీ
- నెలల తరబడి ఆన్‌లైన్ దరఖాస్తుల పెండింగ్
- పర్యవేక్షణ కొరవడటంతో ఆర్టీవోల ఇష్టారాజ్యం
- ఆర్‌సీ కార్డ్‌కోసం ఫీజు చెల్లించినా రెండేళ్లుగా అందని కార్డులు

ఆఫ్‌లైన్‌లో చేతులు తడిపితేనే...

కేంద్రం దేశవ్యాప్తంగా తీసుకొచ్చిన ఈ-వాహన్ యాప్ ద్వారా కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, యాజమాన్య బదిలీ, జాతీయ, అంతర్రాష్ట్ర పర్మిట్‌ల మంజూరు, రెన్యువల్స్

(మిగతా 8వ పేజీలో)



రాష్ట్రంలో ఎక్కడి ఆర్టీవో కార్యాలయంలోనయినా సేవలు పొందేలా ఆన్‌లైన్ యాప్‌లోనే ఇచ్చిన ఆప్షన్

కృష్ణా జిల్లా వంటి కొన్ని జిల్లాల్లోని ఆర్టీఓ కార్యాలయాల్లో ఏ రోజుకారోజు దరఖాస్తులన్నీ పరిశీలించి, వాటికి అప్రూవల్ ఇవ్వాల్సిందేనని ఆదేశాలున్నాయి. ప్రతి విభాగంలోనూ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా జీరో చూపించి, దానిని ఫొటోతీసి ఉన్నతాధికారులకు ప్రతి రోజూ అప్‌లోడ్ చెయ్యాలి. కానీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాత్రం అది కనిపించటంలేదు.

> కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలంటే రూ. 1065 ప్రభుత్వ చలానా చెల్లించాలి. ఇవికాక రూ. 1000 నుంచి రూ. 1800 అదనంగా అందిస్తేనే ఆ ఫైల్ ముందుకు వెళుతుంది. ఇవన్నీ సాధారణంగా జరుగుతున్న తంతే. ఇవికాక ఈ-కేవైసీ వంటివి, ఫోన్ నంబర్ అప్డేట్, కొత్త జిల్లాలు వచ్చాక మండలం, జిల్లా పేరు మార్పుల వంటివి ఆధార్ కార్డు జతచేస్తే దాని ఆధారంగా చేసేవే అయినా, వాటికీ మామూళ్లు ఇచ్చుకోవలసిన పరిస్థితి. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో రూ. 600 నుంచి రూ. 700 వరకు ప్రతి దరఖాస్తుకు ఒక రేటు నిర్ణయించారు. ఈ మొత్తం చెల్లిస్తేనే ఈ-కేవైసీ వంటివి కూడా ఓకే చేస్తున్నారంటే దోపిడీ పరిస్థితి అర్థమవుతుంది. మేమేమీ లంచాలు తీసుకోవటంలేదని, నిబంధనల ప్రకారం పనిచేస్తున్నామని కొందరు అధికారులు చెబుతుంటే, ఏరోజుకారోజు పరిష్కారంచూపాల్సిన దరఖాస్తులు నెలల తరబడి వందల సంఖ్యలో ఎందుకు పెండింగ్ ఉంటున్నాయనేది అంతుబట్టని విషయం. పైగా ఒకదాని తర్వాత ఒకటి వరుస క్రమంలో పరిష్కారం కావలసిన దరఖాస్తులు అక్కడక్కడ ఒక్కోటి అవుతున్నాయంటే... దీనివెనకున్న కారణాలేమిటనేది అధికారులే చెప్పాల్సిన మాట.

చెరువులను బలోపేతం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. నీటి నిల్వ సామర్థ్యం పెంచేవిధంగా పూడికతీత పనులకు శ్రీకారం చుట్టాలని సంకల్పించింది. కట్టలను పటిష్టం చేసి కంప చెట్లను తొలగింపు పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి జిల్లాలో పంచాయతీకి ఒక కుంట లేదా ఒక చెరువును ఎంపిక చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది చెరువులకు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

చెరువులకు మహర్దశ

- రెండో విడత అమృత్ సరోవర్ పనులకు శ్రీకారం
- పంచాయతీకి ఒకటి చొప్పున ఎంపిక


అధ్వాన స్థితిలో ఉన్న చెరువు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమృత్ సరోవర్ రెండో విడత కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రెండేళ్ల కిందట ప్రతి జిల్లాలో మండలానికి ఒకటి నుంచి మూడు చెరువుల వరకు అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. మూడు జిల్లాలో 223 చెరువులను అభివృద్ధి చేశారు. పల్నాడు జిల్లాలో 75, గుంటూరు జిల్లాలో 75, బాపట్ల జిల్లాలో 73 చెరువులను అమృత్ పథకం మొదట విడతలో అభివృద్ధి చేశారు. ఉపాధిహామీ, నీటిపారుదలశాఖ పర్యవేక్షణలో ఆయా పనులు పూర్తి చేశారు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో పంచాయతీలో ఒక చెరువు లేదా ఒక కుంటను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న సాగుకు నీరందించే చెరువులను బలోపేతం చేయాలని నిర్ణయించారు.

తాజాగా మళ్లీ పంచాయతీకి ఒక కుంట లేదా చెరువును గుర్తించాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులు అందాయి. ఒక్కో చెరువు లేదా కుంటలో నీరు నిల్వ చేయడానికి కనీసం ఒక ఎకరా విస్తీర్ణంలో ఉండాలి. 10 వేల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ చేసేవిధంగా పనులు చేయనున్నారు. ఇందు కోసం ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించనున్నారు. కట్టలపై కంప చెట్లు తొలగించి మరింత పటిష్ఠం చేయనున్నారు. గత కొన్నేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో కట్టలు బలహీనంగా ఉన్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు వచ్చిన వరదనీటి ఉధృతికి గండ్లు పడుతున్నాయి. సమీపంలో ఉన్న భూములు కోతకు గురవుతున్నాయి. ఇసుక, మట్టి మేటలు వేయడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చెరువులను మరింత బలోపేతం చేయనున్నారు. మండలాల వారీగా కుంటలు, చెరువులను ఎంపిక చేస్తున్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేశారు. చెరువులు.. కుంటలను త్వరగా గుర్తించి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఒక్కో చెరువులో పనులు చేయాలంటే ఉపాధి హామీ పథకం కింద రూ.5 నుంచి రూ. 10 లక్షల వరకు మంజూరు చేసే అవకాశం ఉంది.

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు అంచనాలు రూపొందించే ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రతిపాదనలు అందగానే పనులు చేపట్టడానికి అనుమతులిస్తారు. మూడు జిల్లాల్లో 1172 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 223 పంచాయతీల్లో అమృత్ పథకం తొలివిడతలో చెరువులను అభివృద్ధి చేశారు. పల్నాడు జిల్లాలో 434, బాపట్ల జిల్లాలో 353, గుంటూరు జిల్లాలో 152 చెరువులను అమృత్ -2 పథకం కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రెడీ అవుతున్నాయి.

ఉడతా ఉడతా ఊచ్... ఆహారం దొరికిందోచ్...

ఆహారం కోసం వెతుకుతున్న ఉడతకు ఓ ఇంటిపై ఉంచిన పూరీ ముక్క దొరకటంతో నోటితో కరుచుకొని వెళ్లి ప్రశాంతంగా తింటున్న దృశ్యం.






నకిలీ డ్వాక్రా గ్రూపులతో.. రూ.1.16 కోట్లు స్వాహా

నల్లపాడు జీడీసీసీలో మరో కుంభకోణం

బ్యాంకును అప్రమత్తం చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

గుంటూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో చోటుచేసుకున్న మరో ఘోరం వెలుగులోకి వచ్చింది. నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి రూ. 1.16 కోట్లు కొట్టేశారు. ఈ విషయాన్ని గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ గుర్తించింది. మొత్తం 10 నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి బ్యాంకును మోసగించారు. ఆ సంఘాలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందినవి కాదని పీడీ టీవీ విజయలక్ష్మీ స్పష్టం చేశారు. అదే విషయాన్ని జీడీసీసీ బ్యాంకు దృష్టికి తీసుకెళ్లారు. నకిలీ డ్వాక్రా గ్రూపులతో కొందరు వ్యక్తులు జీడీసీసీలో రూ. 1.16 కోట్లు దారిమళ్లించిన విషయానికి సంబంధించిన సమాచారాన్ని పీడీ విజయలక్ష్మీ పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఈ వ్యవహారంలో జిల్లా అధికారులు సీరియస్‌గా వున్నారు.

23 నుంచి మిర్చియార్డులో.. ఉచిత భోజనం

- ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మీల్స్
- డైనింగ్ హాల్స్‌ని సిద్ధం చేసిన అధికారులు
- టిఫిన్, లంచ్ కలిపి ఒక్కో వ్యక్తికి రూ. 132.65 పైసల ఖర్చు
- గత వైసీపీ హయాంలో రూ. 150 చెల్లింపు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చి సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరుకు వచ్చే రైతులు భోజనం కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఉచిత భోజన పథకాన్ని ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించింది. రోజుకు ఎంతమంది రైతులు వచ్చినా భోజనం వడ్డించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 23వ తేదీన జిల్లా ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. యార్డు నల్లపాడు గేటు వైపున ఉన్న రెండు భోజన శాలల్లో ఉదయం 11 గంటల నుంచే రైతులకు మధ్యాహ్న భోజనం వడ్డించడం ప్రారంభిస్తామని అధికారవర్గాలు తెలిపాయి. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడే కార్యక్రమంగా పేర్కొన్నాయి.

అల్పాహారం, భోజనం ఇలా...

ప్రతీ రోజు రెండు ఇడ్లీ, చట్నీ, కారంపొడి, టీ సోమ, బుధ, శుక్రవారాలలో అయితే కట్టె పొంగలి(సాంబారుతో), మంగళ, గురువారంలో టమాటబాత్ వడ్డిస్తారు. మధ్యాహ్న భోజనంలో ఒక స్వీటు, గుడ్డు, అన్నం, పప్పు, వేపుడు కూర, రోటీ పచ్చడి, సాంబారు, ఇగురు కూర(శాకాహారం), పెరుగు వడ్డన చేస్తారు.

వైసీపీ హయాంలో కంటే ఛార్జీలు తక్కువ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేశారు. అయితే ఇందుకు గాను ఒక్కో ప్లేటుకు రూ. 150 వరకు వసూలు చేశారు. అయితే ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వ అధికారులు సంప్రదింపులు జరిపి ధరలు తగ్గించేలా ఒప్పించారు. తద్వారా అల్పాహారం రూ. 42.75 పైసలు, భోజనం రూ. 89.90 పైసలకు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకొన్నారు. దీంతో రెండూకలిపి రూ. 132.65 పైసలకు తగ్గిపోయింది. తొలి రెండు రోజులు మధ్యాహ్న భోజన పథకం మాత్రమే అమలు చేస్తామని, వచ్చే సోమవారం నుంచి ఉదయం అల్పాహారం కూడా ప్రారంభమౌతుందని మార్కెట్ కమిటీ సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు తెలిపారు.


మిర్చియార్డులో రైతులకు ఉచితంగా అల్పాహారం, భోజనం వడ్డించేందుకు సిద్ధం చేసిన భోజన శాల

ఆర్టీసీకి పండగే
- సంక్రాంతికి రాకపోకలతో రూ. కోటి వరకు ఆదాయం
- తిరుగుప్రయాణికులతో గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో రద్దీ

8

ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం డిగ్రీ కోర్సుల ఫలితాల విడుదల

రేకుల షెడ్డు ఇంటిలో భారీ పేలుడు
- గదిలో చెలరేగిన మంటలు
- వృద్ధ దంపతులకు గాయాలు

6

తీరనున్న..శివారు నీటి కష్టాలు

- నరసరావుపేట రక్షిత నీటి పథకం విస్తరణ
- డీపీఆర్ సిద్ధం చేసిన మునిసిపాల్టీ
- రూ 23.60 కోట్లతో వ్యయం అంచనా
- పైపులైన్లు.. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు
- పబ్లిక్ హెల్త్ శాఖకు చేరిన డీపీఆర్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మునిసిపాలిటీ రక్షిత మంచి నీటి పథకాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రూ 23.60 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు డీపీఆర్‌ను(డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) రూపొందించారు. శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేసేందుకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. డీపీఆర్‌ను పబ్లిక్ హెల్త్ ఉన్నతాధికారులకు మునిసిపల్ అధికారులు అందజేశారు. నీటి పథకం విస్తరణకు ప్రభుత్వానికి కూడా ప్రతిపాదనలు పంపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నీటి పథకం విస్తరణకు ప్రభుత్వాన్ని నిధులు కోరిన నేపథ్యంలోనే డీపీఆర్‌ను సిద్ధం చేశారు.


శాంతి నగర్ వద్ద ఉన్న నీటి శుద్ధి ప్లాంట్

నరసరావుపేట తాగునీటి పథకాన్ని 1997లో విస్తరించారు. 25 సంవత్సరాలు దృష్టిలో ఉంచుకొని నీటి పథకాన్ని విస్తరించారు. జిల్లా కేంద్రం కావడంతో పాటు.. పట్టణ జనాభా అప్పటితో పోల్చితే దాదాపు రెట్టింపు అయింది. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. పెరిగిన జనాభా.. పట్టణ విస్తీర్ణం అనుగుణంగా నీటి పథకాన్ని విస్తరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అమృత్ పథకం కింద నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. నకరికల్లు వద్ద నీటి నిల్వ చెరువు ఉంది. అక్కడి నుంచి శాంతి నగర్‌లోని నీటి శుద్ధి ప్లాంట్‌కు పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తారు. అవసరాలకు తగ్గట్టుగా ప్రస్తుతం ఉన్న పైపు వ్యాసార్థం సరిపోవడంలేదు. వేసవిలో నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. చెరువులో నీటినిల్వ తగ్గిన సమయంలో నీటి శుద్ధి ప్లాంట్‌కు పూర్తి స్థాయిలో నీరు అందడంలేదు. దీంతో పైపులైన్ సంపు నుంచి మోటార్ల ద్వారా నీటిని ప్లాంట్‌లోకి తోడుతున్నారు. గత రెండేళ్లుగా వేసవిలో ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు నకరికల్లు చెరువు నుంచి నీటి శుద్ధి ప్లాంట్ వరకు మరో పైపులైను నిర్మించేందుకు డీపీఆర్ రూపొందించారు.

పట్టణంలో రెండేళ్ల క్రితం వివిధ పంచాయతీలలోని కొంత ప్రాంతాన్ని మునిసిపాల్టీలో విలీనం చేశారు. ఆయా ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు పైపులైన్‌లు లేవు. ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి నీటి సరఫరా చేస్తుంటే చివరి ప్రాంతాలకు నీరు అందడంలేదు. అలాగే విలీన ప్రాంతాలకు కుళాయిలు ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రావిపాడు రోడ్డులోని కాసు బ్రహ్మానంద రెడ్డి పార్కులో ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రతిపాదించారు. అమృత్ పథకం ఒకటిలో పార్కులో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించేందుకు అంచనాలు రూపొందించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని నిలిపివేశారు. వినుకొండ రోడ్డులో కొంత ప్రాంతం పట్టణంలో విలీనం చేశారు. వినుకొండ.. కోటప్పకొండ రోడ్డులోని ప్రాంతాలకు నీటిని అందించేందుకు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంతంలో మరో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదించారు. ఈ రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి నీటి పంపిణీకి ట్యాంకులకు నీరు ఎక్కించేందుకు పైపులైన్‌లను నిర్మించేందుకు అంచనా వ్యయాన్ని రూపొందించారు. మునిసిపాలిటీ నుంచి ప్రతిపాదనలు పబ్లిక్ హెల్త్ శాఖకు వెళ్లాయి.

విజ్ఞాన్స్ లారాకు సిస్కో నెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డ్


సర్టిఫికెట్‌ను డాక్టర్ లావు రత్తయ్యకు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఫణీంద్రకుమార్

గుంటూరు(విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్ఠాత్మక సిస్కో నెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డ్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సిస్కో నెట్ ఎకాడ్ సంస్థతో 150 కళాశాలలు అనుసంధానమై ఉన్నాయనీ, అందులో కేవలం 13 కళాశాలలకు మాత్రమే ఈ పురస్కారం లభించిందన్నారు. వీటిలో విజ్ఞాన్స్ లారా ఒకటైనందుకు సంతోషంగా ఉందన్నారు. సిస్కో నెట్ ఎకాడ్ వారిచే నిర్వహించిన నెట్ వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామింగ్ , ప్యాకెట్ ట్రేసర్ అనే అడ్వాన్స్ కోర్సులలో విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తీర్ణత పొంది 8600 సర్టిఫికెట్స్ సాధించినందుకుగానూ ఈ పురస్కారం లభించిందని తెలిపారు. విజ్ఞాన్స్ లారా కళాశాలకు ఈ ప్రతిష్టాత్మక సిస్కో నెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డ్ లభించినందుకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య కళాశాల ప్రిన్సిపల్‌ను, ఆయా విభాగ డీన్లు, విభాగాధిపతులను, అధ్యాపకులను అభినందించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్

తాడేపల్లి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం మహానాడు వద్ద ఇటీవల జరిగిన చోరీలకు సంబంధించిన కేసులో ముద్దాయిని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని అతని నుంచి 82 గ్రాముల బంగారం, 70 గ్రాముల వెండి, 25 వేల నగదు రికవరీ చేసినట్టు సోమవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ రవికుమార్ వెల్లడించారు. మొత్తం విలువ రూ. 5.65 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. కాగా తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో తగినంత సిబ్బంది లేరని, పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని అడిషనల్ ఎస్పీ రవికుమార్ తెలిపారు. సమావేశంలో సీఐ కల్యాణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోట్ల రూపాయలు మింగేసిన వైసీపీ

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- రాష్ట్ర వ్యాప్తంగా 24వేల గోకులాల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ప్రచార వాహనాల పేరుతో కోట్ల రూపాయలు బిల్లులు మింగారని, మూగ జీవాలకు కూడా అన్యాయం చేశారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని నడిగడ్డ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మృతి చెందిన గేదెలకు కనీసం ఇన్సూరెన్స్ చెల్లించిన దాఖలాలు లేవని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాడి రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో 85 శాతం బీమా ప్రీమియం చెల్లించి పాడిగేదెలను కోల్పోయిన రైతులకు కేవలం 20 రోజుల్లో బీమా నగదును చెల్లిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 45 వేల పశువులు చనిపోతే ఒక్క గేదెకు కూడా ఇన్సూరెన్స్ చెల్లించలేదనీ, దీంతో పాడి పశువులపై ఆధారపడిన రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లు అప్పులు మిగిల్చిందని తెలిపారు. మూగ జీవాలకు కనీసం డీవార్మింగ్ మందులు ఇచ్చిన దాఖలాలు లేవని మండిపడ్డారు. పశువుల ఆరోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వాడవాడలా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశుపోషలకు కొండంత అండగా నిలిచిందన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా 24వేల గోకుల షెడ్డులను మంజూరు చేసి, ఆర్నెల్ల వ్యవధిలోనే వాటి నిర్మాణాలు కూడా పూర్తి చేశామన్నారు. పశుపోషణపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, ఏడీ సరోజనిదేవి, శ్రీనివాసమూర్తి, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణిజేటి నాగశ్రీనురాయల్, పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మాదినేని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ బ్లాక్‌కు 'తులసీ రామచంద్ర ప్రభు' పేరు

- భవన నిర్మాణానికి రూ.10 కోట్ల విరాళం
- దాత పేరిట నామకరణానికి ప్రభుత్వ ఆదేశాలు


ప్రభుత్వ సమగ్రాస్పత్రి, ఇన్‌సెట్లో తులసీ రామచంద్ర ప్రభు

గుంటూరు మెడికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో జీ ప్లస్ 4గా చేపడుతున్న సర్వీస్ బ్లాక్ భవనానికి నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, తులసీ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ తులసీ రామచంద్రప్రభు పేరు పెట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ భవన నిర్మాణానికి అయ్యే ఖర్చును రామచంద్ర ప్రభు విరాళంగా అందించనున్నారు. ప్రస్తుతం ఆయన గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధి సంఘం (హెచ్‌డీఎస్) సభ్యుడుగా వ్యవహరిస్తున్నారు. సర్వీస్ బ్లాక్ భవన నిర్మాణానికి దాతగా ముందుకొచ్చిన నేపథ్యంలో ఈ సర్వీస్ బ్లాక్‌కు ఆయన పేరు పెట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. త్వరలో నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. పాత కాంట్రాక్టర్ ఒప్పందం రద్దు చేసిన ప్రభుత్వం, హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ సిద్ధార కన్‌స్ట్రక్షన్స్‌కు ఈ భవన నిర్మాణ పనులు అప్పగించింది. ఈ సర్వీస్ బ్లాక్‌లో సెంట్రల్ కిచెన్, హాస్పిటల్ స్టోర్స్ విభాగం, మెకనైజ్డ్ లాండ్రి, ఎంఆర్‌డీ సెక్షన్, సెంట్రల్ స్టెరిలైజేషన్ డిపార్టుమెంట్ వంటి పలు విభాగాలను ఏర్పాటు చేస్తారు.

పదేళ్ల కిందటే నిర్ణయం

ప్రభుత్వాస్పత్రి అవసరాల కోసం జీ ప్లస్ ఫోర్‌గా సర్వీస్ బ్లాక్ నిర్మించాలని పదేళ్ల కిందటే ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో ఈ భవన నిర్మాణానికి రూ.7,69,42,505 నిధులు మంజూరు చేసింది. హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ శివరామ్ అండ్ కో అనే కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఈ సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులు అప్పగించారు. మొదటి నుంచి ఈ సంస్థ నిర్మాణ పనులపై ఆసక్తి చూపలేదు. రెండు, మూడేళ్ల తర్వాత కూడా 30 శాతం పనులు పూర్తి చేయలేదు. కరోనా తర్వాత సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటి వరకు గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తికాగా, మొదటి, రెండో ఫ్లోర్‌లో సీలింగ్ పనులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు కేవలం రూ.2,12,51,201 విలువైన పనులు మాత్రమే పూర్తి చేశారు. మొత్తం మీద రూ.3.12 కోట్ల వ్యయం చేసినట్లు నిర్మాణ కంపెనీ ప్రకటించింది. నిర్దేశించిన కాల పరిమితిలో సదరు నిర్మాణ సంస్థ సర్వీస్ బ్లాక్ పూర్తి చేయకపోవంతో ఏపీ ఎంఎస్ఐడీసీ సంస్థ, శివరామ్ అండ్ కోతో ఒప్పందం రద్దు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ సర్వీస్ బ్లాక్ నిర్మాణం తన సొంత నిధులతో పూర్తి చేయిస్తామని పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు ముందుకు వచ్చారు. దీంతో ప్రభుత్వం కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. త్వరలో భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

రేకుల షెడ్డులో భారీ పేలుడు

- గదిలో చెలరేగిన మంటలు
- వృద్ధ దంపతులకు గాయాలు


పేలుడుకు ఎగిరిపోయిన రేకులు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో భారీ విస్ఫోటనం సంభవించింది. షేక్ గస్ సైదా కుటుంబం బ్రాడీపేట 6/18లో రేకుల షెడ్డులో నివాసం ఉంటుంది. ఒక గదిలో గస్ సైదా ఆయన భార్య మస్తాన్ బి ఉంటుండగా, మిగిలిన రెండు గదుల్లో కుమారుడు షరీఫ్ కుటుంబం ఉంటుంది. గస్ సైదా ఆటో డ్రైవర్‌గా, కుమారుడు షరీఫ్ కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. సోమవారం వేకువజామున 5.45 గంటల సమయంలో గస్ సైదా నివాసం ఉంటున్న గదిలో భారీ విస్ఫోటనం సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి రేకులు పగిలిపోయాయి. తునాతునకలై పక్కనే ఉన్న రెండంతస్తుల డాబా దాటి అవతల ఇళ్లపై పడ్డాయి. మరో గది సీలింగ్ పగిలింది. గదిలో టీవీ పూర్తిగా దగ్ధమైంది. స్విచ్ బోర్డు కూడా తగలబడింది. పేలుడు శబ్దానికి చుట్టుపక్కల ఇళ్ల వారు భయాందోళనకు గురయ్యారు. ఇంటిలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. బట్టలు కాలిపోయాయి. మంచం తగలబడింది. సామగ్రి చెల్లాచెదురైంది. ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులైన గస్ సైదా, మస్తాన్ బి వంటికి మంటలు అంటుకున్నాయి. పక్క గదిలో ఉంటున్న కుమారుడు షరీఫ్, ఆయన భార్య వెంటనే మంటల్లో చిక్కుకున్న గస్ సైదా, మస్తాన్‌బి దంపతులను బయటకు తీసుకొచ్చారు. ఒంటిపై ఉన్న బట్టలకు మంటలు అంటుకోవడంతో వెంటనే ఆర్పేసి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి తీవ్ర గాయాలు అయినప్పటికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

అంతుచిక్కని పేలుడు కారణాలు

ఎందువల్ల పేలుడు సంభవించి ఉంటుందనేది అంతు పట్టడం లేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పేలుడుకు సంబంధించి ఎటువంటి ఆనవాళ్లు, ఆధారాలు లభించకపోవడంతో పట్టాభిపురం సీఐ వీరేంద్ర విద్యుత్తు, అగ్నిమాపక శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి గ్యాస్ లీక్ కాలేదని తేల్చారు. అదేవిధంగా విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కూడా జరగలేదని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇంటెలిజెన్స్ వర్గాలకు కూడా ఎటువంటి ఆధారాలు లభించలేదు. అయితే పేలుడు ఎలా సంభవించింది అనేది ప్రశ్నార్థకంగా మారింది. టీవీ పేలిందా లేక సెప్టిక్ ట్యాంకు గ్యాస్ లీకై ప్రమాదం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. క్లూస్ టీం కొన్ని ఆధారాలు సేకరించింది. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతామని అక్కడి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా పేలుడుకు సంబంధించిన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

సీఎం కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో విశాఖపట్నం ఉక్కుకు ఆర్థిక భరోసా వచ్చిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్రకే కాక యావత్ ఆంధ్రరాష్ట్రానికి మణిహారం విశాఖ ఉక్కు కర్మాగారం అన్నారు. వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ అన్నారు. ప్లాంట్‌ను పునరుజ్జీవింపజేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. నాపై ఉన్న కేసుల నుంచి నాకు విముక్తి కల్పించండి, కావాలంటే మా రాష్ట్రాన్ని తాకట్టు పెడతానని సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లేవారని తెలిపారు. నేడు అందుకు భిన్నంగా సీఎం చంద్రబాబు నాయుడు హస్తినకు వెళ్లి వస్తున్నారని చెప్పారు. హస్తినకు వెళ్లివచ్చిన ప్రతీసారి రాష్ట్రానికి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్తూనే ఉందన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖస్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజి ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితోపాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అప్పుడు నష్టాలలో ఉన్నప్పుడు కాపాడింది, నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో నుంచి స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించింది చంద్రబాబునాయుడే అన్నారు. తప్పుడు కూతలతో వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా వారి మాటలను వినే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు.

ఏజీ-బీఎస్సీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి మార్గదర్శకాలు జారీ


అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి బీ) సీట్లును భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(హానర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో నింపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ,ఎస్సీ,ఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఒప్పందం


అవగాహనా ఒప్పంద పత్రాలతో వీఐటీ, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్లు

ఐనవోలు (తుళ్లూరు) జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించటం, పరిశోధన సహకారాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా వీఐటీ (వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)- ఏపీ విశ్వవిద్యాలయం, ఐఐటీ మద్రాస్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. రెంటి మధ్య విస్తృత ఒప్పందంగా గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ డీన్ రఘునాథన్ రంగస్వామితో మొదట ఒప్పందం, ఇండియా ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటిమద్రాస్) నేతృత్వంలోని ప్రతిష్టాత్మక ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్(ఐఎస్ఈఏ)ప్రాజెక్టు కింద వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయాన్ని స్పోక్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తిస్తూ రెండో అవగాహన ఒప్పందంపై వీఐటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వి కోటారెడ్డి ఐఐటీ నుంచి ఐసీఎస్ఆర్ డీన్ డాక్టర్ మను సంతానం సంతకం చేశారు. ఈ ఒప్పందాల వల్ల వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయం కీర్తి మరింత పెరుగుతుందని, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ ముదిగంటి అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రముఖులు, వీఐటీకి చెందిన అమిత్‌చవాన్ డాక్టర్ సుధాకర్ ఇలంగో, డాక్టర్ శిబి చక్రవర్తి పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు


ప్రథమస్థానం సాధించిన పల్నాడు జిల్లా ఎడ్లజత

దుర్గి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 71వ కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని సోమవారం స్థానిక వినుకొండ రోడ్డులోని వేణుగోపాలస్వామి మాన్యంలో ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రెండు పళ్ల విభాగం పోటీలను మాచర్ల పట్టణంలోని రవితేజ హాస్పిటల్ వైద్యుడు గోనుగుంట్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ పోటీల్లో పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన జవ్వాజి మేఘనానాథ్ నాయుడు ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 3750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడుకు చెందిన మూపర్తి నవీన్ ఎడ్లజత 3645 అడుగులతో రెండోస్థానం, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం హరవేదకోటకు చెందిన షేక్ దస్తగిరి ఎడ్లజత 3 వేల అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరుకు చెందిన మలిశెట్టి ప్రవీణ్‌కుమార్ ఎడ్లజత 2585 అడుగులతో నాలుగోస్థానం, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం వంగపాడుకు చెందిన కైపా వెంకటరమణారెడ్డి ఎడ్లజత 2291 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి. రిఫరీలుగా గూడా శ్రీను, బండ్ల ప్రసాద్ వ్యవహరించారు. టీడీపీ నేత వంకమళ్ల కోటేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి, రుద్రాల రవి, రిటైర్డ్ లైన్‌మ్యాన్ వెలిదండి గోపాల్, కటకం రామ్మోహనరావు, గండె గోపాలరావు పర్యవేక్షించారు. మంగళవారం నాలుగుపళ్ల విభాగంలో పోటీలు జరుగనున్నాయి.

28 నుంచి రెండు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పోటీలు

రెంటచింతల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలోని 175 సంవత్సరాల కానుకమాత చర్చి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 28 నుంచి రెండు రాష్ట్రల స్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు చర్చి ఆవరణలో కానుకమాత కోడె గిత్తల పోటీ నిర్వాహకులు సోమవారం పోస్టర్లను విడుదల చేశారు. 6 విభాగాల్లో పోటీలుంటాయని ఒక్కో విభాగానికి 9 రకాల బహుమతులుంటాయన్నారు. 3వ తేదీ వరకు పందేలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌ను చదును చేసినట్లు తెలిపారు. రాయలసీయ, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే ఎడ్ల పోటీల నిర్వాహకులకు వసతి కల్పిస్తామన్నారు. సుమారు రూ.15 లక్షల విలువ చేసే బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

బీసీల బాంధవుడు చంద్రబాబు

- ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బీసీల బాంధవుడు చంద్రబాబు అని, బీసీ సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని శాసనమండలి సభ్యుడు దువ్వారపు రామారావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం బీసీ మంత్రుల అభినందన సత్కార కార్యక్రమ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిందనీ, టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 5 నెలల్లోనే కార్పొరేషన్ పదవులకు చైర్మన్లను నియమించడమే కాకుండా బీసీ కార్పొరేషన్‌కు నిధులు కూడా కేటాయించి చంద్రబాబు బీసీల మనిషి అని నిరూపించుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం కీలక మంత్రి పదవులు, చైర్మన్ పదవులలో బీసీలనే నియమించిందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి ఈ నెల 27న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బీసీ మంత్రుల అభినందన సభ జరుపుతున్నామని తెలిపారు. సమావేశంలో టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, బండపల్లి శ్రీనివాసరావు, గంజం రాఘవేంద్ర, మల్లె ఈశ్వరరావు, ఉప్పుటూరి పేరయ్య, గుర్రపుశాల రామకృష్ణ, రాచకొండ నాగేశ్వరరావు, తుమ్మేటి మురళి తదితరులు పాల్గొన్నారు.

పులి జాడలు ఎక్కడా లేవు

- అటవీ బీట్ అధికారుల వెల్లడి


అడవిలోకి వెళ్తున్న అటవీ సిబ్బంది

తుమృకోట(రెంటచింతల)జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తుమృకోట అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరించినట్లు పాదముద్రలు ఏవీ లేవని శిరిగిరిపాడు సెక్షన్ బీట్ ఆఫీసర్లు విజయనిర్మల, సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆవుల మందపై పులి దాడి చేసిందన్న సమాచారంతో సోమవారం ఉదయం అటవీ సిబ్బంది తుమృకోట గ్రామస్థులు 15 మందితో కలిసి నెమలిశెల ప్రాంతంలో పర్యటించారు. అనంతరం బీట్ ఆఫీసర్లు మాట్లాడుతూ.. నెమలిశెల ప్రాంతంలో విస్తృతంగా గాలించామని, పులి జాడ ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదని స్పష్టం చేశారు. మందలోని లేగ ఆవుదూడ కొద్దిపాటి గాయంతో కనిపించగా దానిని పశువుల కాపరులకు అప్పచెప్పినట్లు తెలిపారు. మంద నుంచి తప్పిపోయిన లేగ దూడ అరుపులకు ఆవులు భయపడి చెల్లాచెదురు కావడంతో, పశువుల కాపరులైన హుస్సేన్ నాయక్, బాలు నాయక్ పులి వచ్చిందన్న అనుమానంతో కేకలు వేస్తూ పరారయ్యారని తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లతో పాటు లింగయ్య, నానరయ్య, చెక్‌పోస్ట్ హెల్పర్ శివనాయక్ పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ఎన్నిక

మంగళగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎస్ఎస్ చెంగయ్య, అధ్యక్షుడిగా రమేష్, కార్యదర్శిగా ఎం.బాలాజీ, ఉపాధ్యక్షులుగా కేవీఎస్ కిరణ్, ఆర్.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా కె.బుజ్జిబాబు, డి.మనోజ్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎయిమ్స్‌లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, ఒకే కుటుంబంలో ఐదుగురికి ఉద్యోగాలు ఇవ్వడం వలన కొత్త వారికి అవకాశం దక్కడం లేదని, అర్హత ఉన్న వారికి పబ్లిక్‌గా ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145.154.165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

77,096 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 90,567 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 77,096 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,523 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7200	14000	334	7200	13500
నెంబరు. 5	7500	10000	నెంబరు.5	10700	10700
273	8000	10000	273	--	--
341	7500	15000	341	7700	13500
4884	11500	12500	4884	--	--
సూపర్ 10	8000	9000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16000	తేజ	7500	16000
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8000	12800
దేవనూరు డీలక్స్	8000	15500	దేవనూరు డీలక్స్	11000	11000
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4000	9000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 37.39 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జోన్ డైరీ

● మాచర్ల పట్టణంలోని రోప్‌వే కాలనీ, పూర్ణయ్య షెడ్డు బజారులలో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ వేణుబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● పిడుగురాళ్ల విద్యుత్ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సైదారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈసదస్సుకు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.

● పిడుగురాళ్ల పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులలో 75 ఏళ్లు నిండిన, వెయ్యి చంద్ర దర్శనములోని దంపతులను మంగళవారం సత్కరించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారి తుల్లిబిల్లి శేషగిరిరావు, మహంకాళి డేవిడ్‌లు తెలిపారు. వరల్డ్ పెన్షనర్స్ డేను పురస్కరించుకొని స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

విస్తృతంగా పశు వైద్యశిబిరాలు



చెన్నాయపాలెంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిసి కమిటీ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మణపల్లి పశు వైద్యశాల పరిధిలోని చెన్నాయపాలెంలో వైద్యశిబిరాన్ని డీసీ కమిటీ ఛైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తుమ్మలచెరువులో 903 పశువులకు, పిడుగురాళ్లలో 487, చెన్నాయపాలెంలో 712 పశువులను వైద్యులు పరీక్షించి పశు యజమానులకు పలు సూచనలు చేయడంతో పాటు, మందులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఏడీ మోహన్‌రెడ్డి, పశువైద్యాధికారులు వెన్నా శ్రీనివాసరెడ్డి, దేవర వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు రాజారావు, వీరారెడ్డి, పఠాన్ హసన్‌అహ్మద్, సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి,(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో మండల పశువైద్యాధికారి డాక్టర్ దిలీప్ ఆధ్వర్యాన పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులను పరీక్షించి రైతులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, బొగ్గవరపు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలోని పెరికపాడు, బయ్యవరం గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులు, గొర్రెలు, మేకలు మొదలైన వాటికి నట్టల నివారణ మందులు, వ్యాక్సిన్‌లు, అందించారు. 76 పశువులకు వైద్యమందించారు. వైద్య శిబిరాలను మండలపశువైద్యాధికారి సీహెచ్ మల్లయ్య ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రారంభించారు.

అచ్చంపేట,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లగూడెం గ్రామంలో నిర్వహించిన పశు వైద్యశిబిరంలో డాక్టర్ స్వాతి దేవి 30 పశువులకు సాధారణ, గర్భకోశ వ్యాధులను పరీక్షించి చికిత్స అందించారు. 180పశువులకు, 50 దూడలకు ఏలిక పాముల మందులు, 1100 జీవాలకు నట్టల నివారణ మందులు అందజేశారు. 1450 గొర్రెలకు బొబ్బ టీకా వేశారు. వైద్య శిబిరంలో సర్పంచ్ తోట పాపారావు, ఆవుల రాంబాబు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండ్రాయి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశువులు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించడం, బొబ్బటీకాలు వేయడం, సూడి పరీక్షలు, ఎద ఇంజక్షన్లు, తిరగ కట్టె పశువులు, ఆనారోగ్యంగా ఉన్న పశువులకు చికిత్సనందించారు. మొత్తం 300 జీవాలు, 60దూడలకు వైద్యసేవలు అందించినట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ కె వెంకట్రామయ్య తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ ప్రభావతి, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

బెల్లంకొండ,(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో మండల పశు వైద్యాధికారి జీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. 14 ఎదకురాని పశువులకు, 23 గేదెలకు, 31 దూడలను నట్టల నివారణ మందు, 50 జీవాలకు బొబ్బర టీకాలు వేసినట్లు బాలకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల కోర్‌కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, విశ్రాంత పశు వైద్యాధికారి మరియదాసు, గోపాల మిత్రలు, పశు వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎండ్రాయి గ్రామంలో జీవాలకు నట్టల నివారణ మందులు వేస్తున్న పశు వైద్యులు

తాగునీటి ట్యాంకు శుభ్రం — ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మండల కేంద్రమైన దుర్గిలోని ముస్లిం బజారులో అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంకుపై 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన 'తాగునీరు అధ్వానం' శీర్షికన వార్త ప్రచురితం కాగా, దీనిపై అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యాన సిబ్బంది ట్యాంకును బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు.

- దుర్గి, (ఆంధ్రజ్యోతి)

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్లటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించనున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన నిర్వహించే ఈ జాబ్‌మేళాకు నాలుగు ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని అన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు కలిగిన అభ్యర్థులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటో, విద్యా సంబంధిత ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సూచించారు.

విశాఖ ఉక్కుపై మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపదల చేయిస్తామని, ప్లాంట్ అభివృద్ధికి కృషి చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి రూ.11,500 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసేలా సీఎం చంద్రబాబు చేసిన కృషి ఇందుకు నిదర్శనమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం ప్రారంభంలోనే అసెంబ్లీలో తీర్మానం చేసిందని, అందుకనుగుణంగానే ప్లాంట్‌ని కాపాడుకోవటం కోసం సీఎం చంద్రబాబు కేంద్రంతో సంప్రదింపులు జరిపారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, చంద్రబాబు, లోకేశ్‌ల కృషితో రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తోందని అన్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

కారంపూడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వాసు అన్నారు. పట్టణంలోని వినుకొండ రహదారిలో సోమవారం ఎస్‌ఐ వాసు వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వాహన చోదకులకు జరిమానా విధించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రాణాల పోగొట్టుకోవద్దని ఎస్‌ఐ వాసు హెచ్చరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

అచ్చంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సైనికుడు చల్లా కోటేశ్వరరావు(సీకే రావు) కుటుంబాన్ని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ దేవుళ్ళ మల్లికార్జునరావు సోమవారం పరామర్శించారు. ముందుగా సీకే రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీకే రావు సతీమణి చల్లా అనూపకళ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లికార్జునరావుతో పాటు వడ్డెర సంఘ ప్రతినిధులు పలువురు ఉన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు

● సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు
● గ్రంథసిరిలో కార్డెన్ సెర్చ్, 15 వాహనాలు సీజ్



గ్రంథసిరిలో రికార్డులు లేని వాహనాలను సీజ్ చేసిన పోలీసు అధికారులు

అచ్చంపేట,జనవరి20(ఆంధ్రజ్యోతి) : సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు చేపడతామని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు.సోమవారం మండలంలోని గ్రంథసిరి గ్రామంలో 60 మంది పోలీసు అధికారులతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నివారణకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్డెన్‌సెర్చ్‌లో రికార్డుల్లోలేని 15 బైక్‌లను సీజ్‌చేశారు. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు సీఐ ప్రసాదు, 60 మంది పోలీసులు పాల్గొన్నారు.

గ్రంథసిరిలో దొంగతనాలు ..

మండలంలోని గ్రంథసిరి గ్రామ పొలాల్లోని విద్యుత్ మోటార్లలో రాగి వైరు దొంగతనానికి గురవుతోందని చెబుతూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి గ్రంథసిరిలోని 8 మంది రైతులు పొలాల్లోని మోటార్లలోవున్న వైర్లు చోరీకి గురయ్యాయి. బొల్లేపల్లి కృష్ణారావుకు చెందిన 250 మీటర్ల వైరు, కోటపాటి నాగేశ్వరరావు, బొల్లేపల్లి లక్ష్మీయ్య, చింత గుంపుల శ్రీనివాసరావు, కిలారి నరసింహారావు, పరు చూరి శివ శంకర్, గట్టంనేని విమలమ్మ తదితర పొలాల్లోని వైర్లు చోరీకి గురి కావటంతో రైతులు ఆవేదన చెందారు. పోలీసులు దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

104 వైద్య సేవలను సద్వినియోగించుకోండి

పాత అంబాపురం (గురజాలటౌన్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు 104 సేవలు వినియోగించుకోవాలని డాక్టర్ బిందు మాధవి అన్నారు. సోమవారం మండలంలోని పాతఅంబాపురం గ్రామంలో సచివాలయం వద్ద 104 వాహనం సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ బిందు మాధవి బాలింతలు, గర్భిణులకు పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య, ఏఎన్ఎం విమలకుమారి, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు రీ సర్వే యజ్ఞం రైతుల సహకారంతో సాధ్యం అవుతుందని తహశీల్దార్ నాగమల్లేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో గ్రామసభ నిర్వహించి రీ సర్వే వలన రైతులకు జరిగే ప్రయోజనాలను వివరించారు. గ్రామసభలో పాల్గొన్న రైతులకు రీసర్వే చేయు విధానం, రీసర్వే షెడ్యూల్ ఖండముల వారీగా సర్వే చేయు సిబ్బంది వివరాలను తెలియజేశారు. రీ సర్వే బుధవారం నుండి ప్రారంభమవుతుందని ప్రజలలో అవగాహన పెంచేందుకు సర్వేసిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, రైతులతో ర్యాలీ నిర్వహించారు.







తుమ్మా జోజిరెడ్డి, రెంటచింతల సొసైటీచైర్మన్

యరపతినేని మట్టయ్య మంచికల్లు సొసైటీ చైర్మన్

అల్లం బ్రహ్మారెడ్డి, పాలువాయి సొసైటీ చైర్మన్

భద్రతే సురక్షిత ప్రయాణానికి రక్ష

పిడుగురాళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రయాణీకుడు భద్రతతో కూడిన సురక్షిత ప్రయాణానికే ప్రాధాన్యమివ్వాలని పిడుగురాళ్ల ఎంవీఐ సీహెచ్ రాంబాబు తెలిపారు. 36వ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని పిడుగురాళ్ల పట్టణంలోని వాహనదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ మద్యంతాగి వాహనం నడపటం, అతివేగం, నిర్లక్ష్యం వంటివి ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి నడిపితే రోడ్డు ప్రమాదా లకు గురైనప్పుడు కొంత వరకు రక్షణ కలుగుతుందని తెలిపారు. అనంతరం ఆర్టీవో కార్యాలయం నుంచి పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్ వరకు ద్విచక్రవాహన ర్యాలీని నిర్వహించారు.

ప్రకృతి సాగు ఉత్పత్తులతో ఎంతో మేలు

పిడుగురాళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలుచేస్తాయని తహసీల్దార్ జే. మధుబాబు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించారు. రైతులతో పాటు ప్రజలు కూడా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు.



బెల్లంకొండలో ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల విక్రయ కేంద్రం

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని బెల్లంకొండ మండల మార్కెటింగ్ ఎంటీ అంజలి సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రంలో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ వనరుల విక్రయం జరుగుతుందని, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానికులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తేజశ్రీ, రామయ్య, హాజరాబీ, మాధవి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తిచేస్తున్న కూరగాయలు, ఆకుకూరల వినియోగం ఆరోగ్యానికి ఎంతో మేలని కొత్త గణేషునిపాడు ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల విక్రయ కేంద్రాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లా నరేంద్ర, డీపీఎం అమల కుమారి, ఉషారాణి, శ్రీను నాయక్, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మాచర్లటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికికృషి చేస్తానని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు తెలిపారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పట్టణంలోని 13వ వార్డులో సోమవారం వార్డుల్లో వసతులను పరిశీలించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. వార్డులోని అన్నక్యాంటీన్ నిర్వహణను పరిశీలించారు. ఛైర్మన్ వెంట కమిషనర్ వేణుబాబు ఉన్నారు.

నీతి, నిజాతీయగల వ్యక్తి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

బెల్లంకొండ, జనవరి20 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాతీయ గల వ్యక్తి ఎమ్మెల్సీ లక్ష్మణరావు అని, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనను గెలిపించుకుందామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ రవిబాబు అన్నారు. సోమవారం బెల్లంకొండలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ప్రజలకోసం పని చేసే వ్యక్తి లక్ష్మణరావు అని, కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే విధంగా మండలిలో పోరాడుతారని అన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నేత నరసింహారెడ్డి, మండల కార్యదర్శి సీహెచ్ పుల్లారావు, రైతుసంఘం నేత మూతుకూరి నరసింహారెడ్డి, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

మాడుగులపై డ్రోన్ నిఘా

మాడుగుల (గురజాలటౌన్) జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడుగులలో సోమవారం సీఐ ఆవుల భాస్కర్ ఆధ్వర్యాన డ్రోన్ నిఘా నిర్వహించారు. గ్రామ శివారు, గ్రామంలోని ఇతర ప్రాంతాల్లో పేకాట, నాటుసారా నిరోధించడం కోసం డ్రోన్ నిఘా నిర్వహించినట్లు సీఐ భాస్కర్ తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

అంబటి విమర్శలు మానుకో

సత్తెనపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌పై, ఎమ్మెల్యే కన్నాలపై చౌకబారు విమర్శలు మానుకోవాలని టీడీపీ పల్నాడుజిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు హితవు పలికారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులను అమ్ముకున్న అంబటికి కూటమి నేతలను విమర్శించే అర్హత లేదన్నారు. తమ నేతల పై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. అంబటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జనసేన నేతలు

ఫ్లెక్సీలను తొలగించాలి

● మునిసిపల్ కమిషనర్‌కి జనసేన నేతలు వినతి

మాచర్లటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో వందలాదిగా ఏర్పాటైన రాజకీయ పార్టీల, సినీ హీరోల ఫ్లెక్సీలను తొలగించాలని జనసేన నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ వేణుబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జనసేన నేతలు మాట్లాడుతూ పట్టణంలో రింగురోడ్డు, అంబేద్కర్, బస్టాండ్ సెంటరు కూడళ్లలో ఎత్తుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం వలన ఒకవైపు వచ్చే వాహనాలు, మరో వైపు వచ్చేవారికి కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. తక్షణమే స్పందించి ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావు, మారబోయిన శ్రీహరి, షేక్ ఫారూక్, వెండి నాగేశయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఎల్‌సీడీసీ సర్వే

క్రోసూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొడ్లేరు, క్రోసూరు గ్రామాల్లో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కుష్టువ్యాధి గ్రస్థుల గుర్తింపు శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ధనుష్, సిరిచందన, షాద్‌లు మాట్లాడుతూ కుష్టువ్యాధిని ముందుగానే గుర్తించటం, సకాలంలో చికిత్స అందించటం ద్వారా బాధితులను శారీరక వైకల్యం నుంచి రక్షించటం ఎల్‌సీడీసీ కార్యక్రమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల నుంచి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పదవులు పంపిణీలో సామాజిక సమతూకం

● మూడు వ్యవసాయ సొసైటీల చైర్మన్ల పేర్లు ప్రకటించిన ఎమ్మెల్యే

రెంటచింతల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కూటమి నేతలకు పదవుల పంపిణీలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సామాజిక సమతూకాన్ని పాటిస్తూ వస్తున్నారు. ఇటీవల సాగునీటి సంఘాల అధ్యక్ష,ఉపాధ్యక్షుల ఎంపికలో ఎవరిని నొప్పించకుండా, అందరికీ ఆమోదయోగ్యకరంగా వ్యవహరించిన ఎమ్మెల్యే ఆదే తరహాలో సోమవారం మూడు వ్యవసాయ సొసైటీల చైర్మన్‌ల పేర్లను ప్రకటించారు. అనాదిగా టీడీపీలో ఉంటూ పార్టీ కోసం కష్టపడ్డవారిని అందలమెక్కించారు. అందులో భాగంగా రెంటచింతల వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్‌గా తుమ్మా జోజిరెడ్డి, మంచికల్లు సొసైటీ చైర్మన్‌గా యరపతినేని మట్టయ్య, పాలువాయి సొసైటీ చైర్మన్‌గా అల్లం బ్రహ్మారెడ్డిని నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రకటించారు.

గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు

మాచర్లటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు అందాయని తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అర్జీదారులతో తహసీల్దార్ తెలిపారు.

వైసీపీని బలోపేతం చేస్తా

● వైసీపీ సత్తెనపల్లి నియోజక వర్గ సమన్వయ కర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి
● మాజీ మంత్రి అంబటి సమక్షంలో బాధ్యతల స్వీకరణ



మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి అభివాదం తెలుపుతున్న గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజకవర్గంలో వైసీపీని బలోపేతం చేస్తానని డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ఆయన వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గజ్జల మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ పని జరగాలన్నా ఒక టీడీపీ నేతలు ఓ కాంట్రాక్టర్ పర్మిషన్ తీసుకోవాలని, నియోజకవర్గాన్ని కాంట్రాక్టర్‌కు కాంట్రాక్ట్ ఇచ్చారని ఆరోపించారు. అధికారం చేపట్టి ఏడు మాసాలు అవుతున్నా సూపర్-6 పథకాలు అమలు కాలేదని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో శుద్ధజలం ప్లాంట్ ప్రారంభం



శుద్ధజలం ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో పీ. సత్యనారాయణ, దాతలు

పెదకూరపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 75 తాళ్ళూరు జడ్పీహైస్కూలు పాఠశాల పూర్వ విద్యార్థి ఉమా సుందరి 2వ వర్ధంతిని పురస్కరించుకొని రూ.5లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన శుద్ధజలం ప్లాంట్‌ను ఎంఈవో పీ.సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమా సుందరి భర్త సింహాద్రి లీలాప్రసాదరెడ్డి, కుమారులు మనో దిలీప్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగు నీటిని అందించాలనే ఉద్దేశంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. దాతలను హెచ్‌ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ జీ పున్నారావు, పాఠశాల యాజమాన్యం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వారికుటుంబ సభ్యులు జీ.సుందరరెడ్డి, తిరుపతిరెడ్డి, జే.సాంబిరెడ్డి, శివా రెడ్డి, శ్యామ్, వెంకటరెడ్డి, మంజులత, ప్రమీల, క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రొఫెసర్ డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రకళ ఏదీ?

- నాటి చరిత్రను తెలిపే చిహ్నాలు కనుమరుగు
- ఎండిన మొక్కలు.. శిథిలమైన ఆట వస్తువులు
- ఆహ్లాదం.. ఆనందం కరవు
- ఇదీ చంద్రకళాపార్కు దుస్థితి


ఆహ్లాదం లేకుండా చెట్లు, మొక్కలు తొలిగించి ఉన్న బాపట్ల రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని చంద్రకళాపార్క్

బాపట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చరిత్ర కలిగిన బాపట్ల చంద్రకళాపార్క్ కళ తప్పింది. ఘనచరిత్ర కలిగిన ఈ పార్క్ బాపట్ల రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉంది. బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని ఈపార్క్‌ను 1950 అక్టోబరు 2న ప్రారంభించారు. అప్పటి మద్రాస్ రాష్ట్ర ఆంధ్రమంత్రులు కల్లూరి 'చంద్ర'మౌళి, 'కళా' వెంకట్రావు పేర్లు మీద దీనిని ఏర్పాటు చేశారు. బాపట్ల గ్రామ పంచాయతీ వారు నాటి సర్పంచి డాక్టర్ చదలవాడ సుబ్బారావు నేతృత్వంలో పార్క్ ఏర్పాటు చేశారు. అప్పటి శాసన సభ్యుడు మంతెన వెంకటరాజు ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రాంతంలో జాతీయ నాయకులు అనేకమంది సభలు, సమావేశాలు ఏర్పాటు చేయగా వాటిల్లో పాల్గొన్నారు. బాపట్లకు ఒక ప్రత్యేక గుర్తింపుగా చంద్రకళాపార్క్ ఉండేది. పార్క్‌లో అనేక రకాల ఆట వస్తువులు, మొక్కలతో ఆహ్లాదకరంగా ఉండేది.

● పార్క్‌లో గ్రంథాలయం

చంద్రకళాపార్క్‌లో గ్రంథాలయం ఉండేది. ఇది బాగా ప్రసిద్ధి చెందింది. అందులో ఉండే రేడియో ద్వారా సాయంత్రం మైక్‌లో వార్తలు వినిపించేవారు. స్వాతంత్రోద్యమ సభలు కూడా ఈ ప్రాంతంలో అనేకం జరిగేవి. ఈ పార్క్‌లో 1954 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్ర ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పట్టణ ప్రథమ మున్సిపల్ చైర్మన్ వెలగపూడి సుబ్బారావు జయస్థూపాన్ని నెలకొల్పారు. అందులో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ విషయాన్ని ప్రస్తావించారు. 1950కు ముందు ఇక్కడ జిట్టా అప్పయ్య రీడింగ్‌రూమ్ నిర్వహించేవారు. వేలాది మంది విద్యార్థులు, పాఠకులు ఇక్కడ పుస్తకాలు, పత్రికలు చదివి విజ్ఞానాన్ని సముపార్జించేవారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసిన జనంతో ఆహ్లాదకరంగా ఉండే ఈపార్క్ నేడు కళాహీనంగా మారింది.

● వైసీపీ హయాంలో పార్కు తొలగింపు

అటు రైల్వేస్టేషన్ ఇటు ఏరియా వైద్యశాల మధ్య కావాల్సినంత విస్తీర్ణంలో చంద్రకళాపార్క్ అందులో లైబ్రరీ, పాఠశాల, ఆటవస్తువులు, ఆహ్లాదాన్ని పంచే అనేక వస్తువులు ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాఫిక్ సమస్యను అధికమించేందుకు పాతబస్టాండ్ నుంచి డీఎస్పీ కార్యాలయం మీదుగా చంద్రకళాపార్క్‌లో నుంచి మార్కెట్ మీదుగా జీబీసీ రోడ్డుకు అనుసంధానం చేస్తూ వన్‌వేరోడ్డు నిర్మించారు. ఆ సమయంలో పార్క్ మొత్తం తొలిగించారు. అందులో ఉన్న పాఠశాలతోపాటు రీడింగ్‌రూమ్ కూడా తొ లిగించారు. రోడ్డు వేయగా దారి పొడవున ఉన్న కొద్ది స్థలం లో పార్క్‌ను అభివృద్ధి చేశారు. నిర్వాహణ మాత్రం వదిలేశారు. దీంతో పార్క్‌లో పెంచిన మొక్కలు ఎండిపోయాయి. ఆట వస్తువులు శిథిలమయ్యాయి. ఆహ్లాదం లేకుండా పోయింది. ఒకప్పుడు కళకళలాడే చంద్రకళా పార్క్ నేడు కళతప్పి కనిపిస్తున్నది. కూటమి నాయకులు దీనిని అభివృద్ధి చేసేందు కు పక్కనే ఖాళీగా ఉన్న రైల్వేస్థలాన్ని కూడా కలిపి ఆహ్లాదకరంగా అభివృద్ధిచేయాలని బాపట్ల ప్రజలు కోరుతున్నారు.



చంద్రకళాపార్క్‌లో 1950వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్, లైబ్రరీ శిలాఫలకం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐడీ ఎస్పీ సరిత, పక్కన బ్యాటింగ్ చేస్తూ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం




క్రీడాస్ఫూర్తితో మెలగాలి

- సీఐడీ ఎస్పీ సరిత
- భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం

గుంటూరు(విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గెలుపు ఓటముల్ని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని అప్పుడే జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని సమర్థవంతంగా పరిష్కరించుకునే నైపుణ్యాలు అలవడుతాయని సీఐడీ ఎస్పీ సరిత అన్నారు. సోమవారం గోరంట్లలోని భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో కేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ బీపీఎల్ 2024-25 పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ సరిత మాట్లాడుతూ అపజయాల నుంచి పాఠాలు నేర్చుకుంటేనే విజయాలు దరిచేరతాయన్నారు. క్రికెట్ కేవలం క్రీడ మాత్రమే కాదనీ, జట్టును సమర్థవంత నాయకత్వంతో నడిపించి సమష్టిగా విజయం సాధించడమేనని అన్నారు. జట్టును స్ఫూర్తివంతంగా, నాయకత్వ లక్షణాలతో నడిపించడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, పోరాట పటిమ క్రికెట్ ద్వారా పెంపొందుతాయని అన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించేందుకు భాష్యం ప్రీమియర్ లీగ్ ప్రారంభించామని తెలిపారు. భాష్యం 150 బ్రాంచీలలో 2021 నుంచి ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ టోర్నమెంట్లో భాగంగా ప్రిలిమినరీస్ జనవరి 20న, క్వార్టర్ ఫైనల్స్ 23, సెమీ ఫైనల్స్ 25, ఫైనల్స్ 26వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి రోజు ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్లో గుంటూరు జెయింట్స్-3, వైజాగ్ చికింగ్-1 తలపడగా గుంటూరు జెయింట్స్- 3 జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం గుంటూరు గార్డియన్స్-2, ఈస్ట్ గోదావరి ఏబెల్స్-3 జట్లు తలపడగా గుంటూరు గార్డియన్స్-2 జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన జట్టుకు సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత రామ్ తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులతో భాష్యం రామకృష్ణ, భాష్యం హనుమంతరావు తదితరులు

అడిగింది ఇస్తేనే.. అప్రూవల్



(5వ పేజీ తరువాయి)

వాహన బీమా, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటివి మంజూరు చేయటం దగ్గర నుంచి ఈ-కేవైసీ వంటివాటి వరకు వాహనదారులు అన్నీ ఆన్‌లైన్‌లో చేసుకునే వెసులుబాటు ఉంది. కేంద్రం కొత్త యాప్ తీసుకొచ్చి సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తోంది కదా! ఎంచక్కగా ఇంటిదగ్గరే ఉండి అన్నీ చేసుకోవచ్చునుకునే వారికి మాత్రం నిరాశ తప్పటంలేదు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కొన్ని కార్యాలయాల్లో రెండు నుంచి నాలుగు నెలలుగా ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయంటే పరిస్థితి అర్థమవుతుంది. లారీలు, బస్సుల వంటి వాహనాలు బ్రేక్ చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ప్రభుత్వ చలానా రూ.970 చెల్లించాలి. ఇది రెండు నెలల ఫీజు. ఈ మొత్తం చెల్లించి అన్ని కాగితాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, వాహనాన్ని చూపితే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. కానీ చలానా మొత్తం కాకుండా అదనంగా రూ.3వేలు మామూళ్ల కింద చెల్లించాలి. ఇది ఎప్పటినుంచో ఉన్న ఆనవాయితీనే. అయితే వాహన్ యాప్ ద్వారా కేంద్రం కొత్త అవకాశాన్ని తీసుకొచ్చింది. నేషనల్ పర్మిట్, అంతర్రాష్ట్ర అనుమతులున్న లారీలకు పర్మిట్ అయిపోతే దానిని ఎక్కడ ఉంటే ఆ దగ్గర్లోని ఆర్టీఓ కార్యాలయంలో రెన్యువల్ చేయించుకునే అవకాశాన్ని కల్పించింది. అయితే ఎక్కడో విశాఖ జిల్లా బండి తెనాలిలో రెన్యువల్ చేసుకోవాలంటే అన్ని ఫీజులు, గతంలోనే నిర్ణయించిన లంచాలకు తోడు అదనంగా రూ.1500 నుంచి రూ.2వేల వరకు చెల్లించుకోవలసిందే. అదేమని ఎవరైనా అడిగితే ఎక్కడి వాహనం అక్కడ చేయించుకునేందుకు వెళితే ఆయిల్ ఖర్చు చాలా అవుతుంది కదా! మీకు అదంతా ఆదా చేస్తున్నాం కదా అని చెప్పి వసూలు చేయటం విశేషం.

ఫీజు చెల్లించినా ఆర్‌సీ కార్డుల్లేవ్

కొత్త వాహనం రిజిస్ట్రేషన్ చేసుకుంటే దానికి సంబంధించిన ఆర్‌సీ కార్డ్ వాహన యజమానికి అందాలి. దీని కోసం 2023 నుంచి కొత్త వాహనాలు కొన్నవారంతా ఎదురుచూస్తున్న పరిస్థితి. కార్డ్ కావాలంటే రూ.225 చెల్లించాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వ కాలంలో కార్డ్‌తో పనిలేకుండా ఆర్‌సీ పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని దానిని కార్డ్‌లాగా తయారు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే అప్పటికే కార్డ్ కోసం డబ్బు చెల్లించిన వారి పరిస్థితిపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా కార్డు తీసుకునేలా రూ.225 చెల్లించాల్సిన విధంగా యాప్‌లో మార్పులు చేశారు. ఆ సమయంలో వాహనాలు కొన్నవారంతా చెల్లించారు. కానీ వారికీ కార్డులు లేవు. ఇటీవల మళ్లీ దానిలోనూ మార్పులు చేసి, కార్డు కావాలా, వద్దా అనే ఆప్షన్‌ను ఆన్‌లైన్‌లో ఇచ్చారు. కావాలనుకునేవారు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. లేనివారు పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని దానినే ఆర్‌సీ కింద చూపించవచ్చు. అయితే కార్డు కావాలని మళ్లీ డబ్బు చెల్లించినవారికీ కష్టాలు యథావిధిగానే కొనసాగుతున్నాయి. కార్డులు రాకపోగా ఆ వాహనాన్ని అమ్మాలంటే కొర్రీలు పెడుతున్న పరిస్థితి. కార్డు రానివారు వాహనం అమ్మబోతే, యాజమాన్య బదిలీకి కుదరదు. మీ కార్డు ప్రింట్ కాలేదు కనుక ముందు కార్డ్ ప్రింటింగ్ అయ్యేలా చూసుకోవాలంటూ ఎర్రర్ చూపిస్తుండటంతో వాహనదారులు రెండు రకాలుగా అవస్థలు పడుతున్నారు. అసలు ఆ కార్డులు ఎక్కడ ముద్రితమవుతాయో! ఎక్కడి నుంచి వస్తాయో కూడా అంతుబట్టని విషయం. వీటికోసం కార్యాలయాల్లో అడిగితే మాకూ ఏ సమాచారం లేదనే సమాధానం మినహా దానికి పరిష్కారం మార్గం చూపినవారేలేరు. దీంతో వాహనాల అమ్మకాలూ పెండింగ్ పడిపోతున్నాయి. వాహనాలు కొనాలన్నా, అమ్మాలన్నా రెండో వాహనం ఉండటం వల్ల ఎక్కువ పన్నులు చెల్లించాల్సిరావటంతో ఆ నష్టాన్నీ వాహనదారులు భరించాల్సిన పరిస్థితి. ఈ-వాహన్ యాప్ వచ్చి చాలా కాలం అయినా, దీనిలో బాలారిష్టాలు అధిగమించినా అధికారుల అలసత్వం, మామూళ్ల మత్తు లక్ష్యాన్ని నీరుగార్చుతోంది. దీనిపై ఉన్నతాధికారుల పూర్తిస్థాయి అజమాయిషీ ఉంటేనే ఆన్‌లైన్ సేవలు సక్రమంగా వాహనదారులకు అందే అవకాశం ఉంది. ప్రభుత్వ పెద్దలు దీనిపై దృష్టిపెడితేనే కొత్త, పాత వాహనాలు ఏ అడ్డంకులూ లేకుండా రోడ్డెక్కే అవకాశం ఉంది.

వైభవంగా ఉరుసు మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా 133వ ఉరుసు మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బాబా వారి సమాధిని దర్శించుకుని వారి, వారి ముడుపులను చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా బాబా వారికి సమర్పించిన శేష వస్త్రాలను నిర్వాహకులు భక్తులకు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బాబా వారు ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచుతామని, దీంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు.


మస్తాన్ బాబా సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం డిగ్రీ కోర్సుల ఫలితాలు విడుదల


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇతర అధికారులు

పెదకాకాని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ గతేడాది అక్టోబర్, నవంబరు నెలల్లో నిర్వహించిన పలు డిగ్రీ కోర్సుల ఫలితాలను విడుదల చేసినట్లు దూరవిద్య పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయిాద్ జైన్ లాబ్దిన్ తెలిపారు. ఫలితాలను సోమవారం వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఏ నాలుగు, ఐదో సెమిస్టర్, బీకాం (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), 4, 5 సెమిస్టర్లు, బీబీఏ కోర్సుల 4, 5 సెమిస్టర్ల రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు వెల్లడించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఫిబ్రవరి 3వ తేదీలోగా ఒక్కొక్క పేపర్‌కు రూ. 770 చెల్లించి, దరఖాస్తులను దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. దూరవిద్య ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏఎన్‌యుసిడిఈ.ఐఎన్ఎఫ్ఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, సీటీఏలు డాక్టర్ లావణ్య, డాక్టర్ కృష్ణ సత్య, ఏసీటీఏ డాక్టర్ శివప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, రెడ్డి ప్రకాష్‌రావు, భాస్కర్, వలి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఉదయ్ కుమార్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల నూతన వైస్ ప్రిన్సిపాల్ గా ఆచార్య ఎల్. ఉదయ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు ఉదయ కుమార్ కు నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఆయన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆచార్య ఉదయ్ కుమార్ బుద్ధిజం విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్‌గా, పీజీ పరీక్షల కోఆర్డినేటర్‌గా, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్‌గా పలు పదవులను ఉదయ కుమార్ నిర్వహించారు.

ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా లబ్ధిదారులను గుర్తించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ 2.0 ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను గుర్తించేందుకు అవాస్ ప్లస్ యాప్ ద్వారా నిర్దేశిత మా ర్గదర్శకాల ప్రకారం సచివాలయ, హౌసింగ్ అధికారులు సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. రూఫ్ లెవల్ పూర్తయిన ఇళ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సం ఘాల ద్వారా బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మా ణాలకు ప్రతివారం నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

గోకులాలు మంజూరు అయిన వాటిలో 50 శాతం కూడా పూర్తి కాలేదని, ఈ వారంలో పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే నవంబరులో ప్రారంభమైందని, ఇంతవరకు పూర్తి కాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఆర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 4 నుంచి 12 వరకు క్యాంప్‌లు నిర్వహిస్తుందని, పీడబ్ల్యూడీలు, సీనియర్ సిటీ జన్లకు చేతి కర్రలు, కృత్రిమ అవయవ పరికరాలు తయారు చేసి అందించడం జరుగు తుందని కలెక్టర్ తెలిపారు. పరికరాల కోసం వచ్చే దివ్యాంగులు వారి సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. మరింత సమాచారం కోసం 9389537925ను సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాదు, సిపిఓ శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మీ, డ్వామా పీడీ శంకర్, భూగర్భ జలనవరుల శాఖ డీడీ వందనం, డీపీవో సాయికుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, దివ్యాంగులు, సీనియర్ సిటి జన్ సంక్షేమ శాఖ ఏడీ సువార్త, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఆర్టీసీకి పండగే..

- సంక్రాంతికి రాకపోకలతో రూ.కోటి వరకు ఆదాయం
- తిరుగు ప్రయాణీకులతో ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో రద్దీ



గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడురోజుల ముచ్చటైన సంక్రాంతి పండుగ ఆర్టీసీకి అదిరిపోయే ఆదాయాన్ని సమకూర్చింది. పండుగకు ప్రయాణీకుల రాకపోకలతో గుంటూరు జిల్లాలో ఆర్టీసీకి రూ.కోటి వరకు టిక్కెట్ ఛార్జీల రూపంలో ఆదాయం సమకూరినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం రవికాంత్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేశారు. విభజిత గుంటూరు జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతో పాటు పొన్నూరు, తెనాలి, మంగళగిరి డిపోల నుంచి సాధారణ షెడ్యూల్ బస్సులతో పాటు అదనపు సర్వీసులను ఏర్పాటుచేశారు. పండుగకు ముందుగానే గుంటూరుకు వచ్చే ప్రయాణీకుల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్ ప్రాంతాల నుంచి 171 బస్సులను ఏర్పాటుచేశారు. కాగా పండుగ ముగిసిన తరువాత కనుమ రోజు పెద్దగా ప్రయాణీకుల రద్దీ ఉండదని అధికారులు భావించినా అందుకు భిన్నంగా కనిపించింది. కనుమ తరువాత రోజు కూడా ప్రయాణీకుల రద్దీ ఉండటంతో అదనంగా మరో 75 బస్సులు ఏర్పాటుచేశారు. ఇక విద్యార్థులకు సెలవులు ఆదివారంతో ముగియటంతో శని, ఆదివారాలు రాత్రి ప్రయాణీకుల రద్దీ పెరిగింది. దాంతో ఈ రెండు రోజుల్లో 70 సర్వీసులు అదనంగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సోమవారం రాత్రి కూడా మరో 10 బస్సులు అందుబాటులో ఉంచారు. గుంటూరు నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్ వంటి దూర ప్రాంతాలకు రద్దీ కనిపించింది. మొత్తానికి సంక్రాంతి పండుగకు జిల్లాలో ఐదు డిపోల నుంచి టిక్కెట్ ఛార్జీల రూపంలో సుమారు రూ.కోటి వరకు ఆదాయం సమకూరింది.


ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణీకుల రద్దీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న టీడీపీ నేతలు

విశాఖపట్నం, చిత్తూరు జట్ల గెలుపు

మంగళగిరి సిటీ (నవులూరు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీల్లో భాగంగా 9వ రోజు విశాఖపట్నం, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. ప్రకాశం జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 17.4 ఓవర్లలో 121 పరుగులు చేసి ఆలౌటయింది. 2.4 ఓవర్లలో పది పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టిన ధీరజ్ లక్ష్మణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కడప జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 18.4 ఓవర్లలో 199 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌటయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 17.3 ఓవర్లలో 148 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. 43 బంతుల్లో 74 పరుగులు చేయడంతోపాటు 3.3 ఓవర్లలో 37 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టిన కె.దినేష్ వర్మ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నారు. తెలుగు యువత మంగళగిరి పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. ఈ పోటీలకు సేల్, నక్కు, ఉషోదయ, మర్కోరోస్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

విధుల నుంచి వీఆర్వో మహబూబ్ సుభానీ తొలగింపు

యడ్లపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఉత్వర్వుల మేరకు యడ్లపాడు-1 వీఆర్వోగా పనిచేస్తున్న సయ్యద్ మహబూబ్ సుభానీని విధుల నుంచి తొలగించినట్లు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, ఉద్యోగం ఇప్పిస్తానని, అసైన్డ్ భూములకు పట్టాలు ఇప్పిస్తానని నగదు తీసుకుని మోసం చేయడం, వంకాయలపాడు వీఆర్వోగా రైతుల నుంచి మామూళ్ళు వసూలు చేయడంపై పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆరోపణలు వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు సోమవారం కార్యాలయానికి చేరాయి. దీంతో వీఆర్వోను విధుల నుంచి తొలగించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వరవకట్టలో కార్డన్ సెర్చ్

నరసరావుపేట లీగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న వరవ కట్టలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు, తిరిగి అర్ధరాత్రి 12:30 గంటల నుంచి తెల్లవారుజాము మూడు గంటల వరకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డ్రోన్ల సహాయంతో భూమార్గంలో భారీ సంఖ్యలో పోలీసులతో వరవకట్టను క్షుణ్ణంగా జల్లెడ పట్టారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశం మేరకు నరసరావుపేట డీఎస్పీ కే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నలుగురు సీఐలు, పది మంది ఎస్ఐలు, వందమంది సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. సరైన అనుమతి పత్రాలు లేని పలు వాహనాలను స్టేషనుకు తరలించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యమైన ఆహారం: డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పండించిన పంటలతో ఆరోగ్యకరమైన ఆహారం ప్రజలకు అందించడం జరుగుతుందని డీపీఎం అమలకుమారి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను డీఆర్వో మురళి, డీపీఎం అమలకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్వో మురళి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలలో ఎటువంటి పురుగు మందుల అవశేషాలు లేకుండా ఆరోగ్యకరమైన ఆహార పంటలు ప్రజలకు అందించడం జరుగుతుంన్నారు. పల్నాడు జిల్లాలో ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల వద్ద, జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల వద్ద ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయం పద్ధతులు అనుసరించి పండించిన పంటలను స్టాల్ ఏర్పాటుచేసి విక్రయించడం జరుగుతుంది ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● రొంపిచర్ల: మండలంలోని తుంగపాడులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. రాష్ట్ర అధికారి రామచంద్రరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా వ్యవసాయాన్ని ఏటీఎం మోడల్‌గా మార్చుతున్నార న్నారు. అంత పంటలుగా కాకర, బీర, తోటకూర, పలకూర వంటి వాటిని సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా మిరప పంటలో తామర పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ఆచరించాలని రామచంద్రం తెలిపారు.

● వినుకొండ: తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ సహాయకుల సహాయంతో ఆకుకూరలు, కూరగాయలు ప్రజలకు విక్రయించడం జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సలహాదారుడు తిరుపతిరావు సోమవారం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వినుకొండ మండలంలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలను సేకరించి విక్రయ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కావాల్సిన వారికి ఉచిత సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు సెల్: 9866650504ను సంప్రదించాలన్నారు.

జెండర్ రీసోర్స్ సెంటర్ ప్రారంభం

ఈపూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో జెండర్ రీసోర్స్‌పర్సన్ సెంటర్‌ను సోమవారం ఏపీఎం వీవీ రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సమాజంలో లింగవివక్షతను, వరకట్నం వేధింపులు ఎదుర్కొంటున్న వారికోసం ప్రతి గురువారం కార్యాలయంలో సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిన్నమ్మాయి, సీసీ నాగేశ్వరరావు, హనుమంతురావు, నరేష్‌రెడ్డి, వీవోఏలు పాల్గొన్నారు.

పేరూరుపాడులో కంటి వైద్య శిబిరం

బొల్లాపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడులో శివ శక్తి లీలాంజలి ఫౌండేషన్, శంకర్ కంటి హాస్పటల్ సౌజన్యంతో కంటి వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో కంటికి సంబంధించిన వైద్య పరీక్షలు జరిగాయి. వైద్య పరీక్షలు నిర్వహించి కంటి శుక్లాల ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఈ నెల 26న వినుకొండలో జరిగే మెగా వైద్య శిబిరంలో రిఫర్ చేయటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సాగు నీటి సంఘం అధ్యక్షులు గుర్రం నరసింహారావు, యూనిట్ ఇన్‌చార్జ్ గంగినేని రమణయ్య, సీనియర్ నాయకులు కాట్ల కోటేశ్వరరావు, పి.చినగోవిందు, కాట్ల రామయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు వారం రోజుల శిక్షణ

నరసరావుపేట లీగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడులోని అన్ని ప్రైమరీ, అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్‌లో విధులు నిర్వహించే నిర్వహించే 72మంది ల్యాబ్ టెక్నీషియన్లకు వారం రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి సోమవారం తెలిపారు. శిక్షణ తరగతులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ నెల 20 నుంచి 25వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని నడిగడ్డ గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ముందుగా గేదెలకు వైద్యులు అందిస్తున్న వైద్య పరీక్షలతోపాటు పంపిణీచేస్తున్న మందులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశు యజమానులకు ఉచితంగా నట్టల నివారణ, విటమిన్ మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మూగజీవాల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా, ఉచిత వైద్య శిబిరాలను గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 300 సంచార వాహనాల్లో మందులను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గ్రామాల్లో అనారోగ్యానికి గురైన పశువుల ఆరోగ్యం కోసం 1962 నెంబరుకు ఫోన్‌చేస్తే పశువైద్యులు ఇంటి వద్దకు వచ్చి చికిత్స అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణిజేటి నాగశ్రీనురాయల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి (డీహెచ్‌వో) డాక్టర్ కాంతారావు, వినుకొండ ఏడీ సరోజనీదేవి, ఈపూరు ఏడీ శ్రీనివాసమూర్తి, పశువైద్యులు వెంకటశివాజీ, మనోజ్, డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఈవోపీఆర్డీ సుందరరెడ్డి, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కే లలిత కుమారి ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని యడ్లపాడు ఏరియా పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ వై రాధాకృష్ణ ఆకస్మిక తనిఖీ నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్యాధికారి సీహెచ్ సాంబశివారెడ్డి, సిబ్బంది డీ పవన్ కుమార్, కమలాకర్, ఆంజనేయులు, నాగరాజు తదితరులు సేవలందించారు.



పశు పోషకులకు ఉచితంగా ఇచ్చే మందులను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

● యడ్లపాడు: పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వై రాధాకృష్ణ అన్నారు. మండలంలోని కొత్తపాలెంలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సొలస పశువైద్యాధికారి డాక్టర్ రోజర్‌బిన్నీ, సహాయకులు సత్యనారాయణ, రవి, ప్రకాష్‌రాజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: పాడిరైతుల అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముప్పాళ్ళ, ఉప్పరపాలెం గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలను సోమవారం జగ్గారావు ప్రారంభించారు. కార్యక్రమంలో పశు వైద్యులు సునీత, గోపాల్ నాయక్, విడవలపాటి హనుమయ్య, కూరాకుల శ్రీనివాసరావు, నూరే కోటేశ్వరరావు,పాపారావు,శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: మండలంలోని వెలమావారిపాలెం, శానంపూడి గ్రామాలలో సోమవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలను నర్సరావుపేట డివిజన్ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రామచంద్రరావు క్షేత్రస్థాయిలో సందర్శించారు. పశు వైద్యాధికారులు పాలపర్తి గణేష్‌కుమార్, సోమల గుణధీర్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బీర్నీడి రత్నప్రభ, మొనపాటి శ్రీనివాసరావు, గ్రామ నాయకులు ఎల్.శ్రీనివాసరావు, వెటర్నీ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని ఐనవోలులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి శివాజీ పశు వైద్య సహాయకులు, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి, రెడ్డిపాలెం గ్రామాల్లో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలు జరిగాయి. కార్యక్రమంలో డాక్టర్ ఆవుల సాయి మహేష్‌రెడ్డి, మాచవరం, ఎడ్వర్డుపేట, విప్పర్ల, నలగార్లపాడు, అలవాల, అన్నవరం, ఆరేపల్లి, బుచ్చిబాపన్నపాలెం, ఏహెచ్‌ఏలు, వీఎల్‌వో శ్రీహరి, వీఏ వేమారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి

కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యతన జరిగింది. కార్యక్రమంలో ప్రజల నుంచి 32 వినతులను జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ సమస్యలను సావధానంగా విని, సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

నరసరావుపేట లీగల్: ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 77 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి నిర్దీత గడువులోగా ఫిర్యాదును పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీకి శంకుస్థాపన


నరసరావుపేట లీగల్, జనవరి 20 (ఆంధ్రజోతి): పట్టణంలోని జిల్లా వైద్యశాలలో సోమవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబులు ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ, అపోలో డయాసిస్ యూనిట్లను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు, వైద్య శాఖ మంత్రి చొరవతో జిల్లా వైద్యశాలకు ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ కోటి 30లక్షల రూపాయలతో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మరో 36లక్షలతో డయాలసిస్ యూనిట్ ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తపాలెం గ్రామం నుంచి కోటప్పకొండ వరకు రోడ్డు మరమ్మతుల కోసం నాలుగు కోట్ల రూపాయలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేటాయించారన్నారు. వీటికోసం కృషిచేసిన పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి రవి, డాక్టర్ ఎల్.వెంకటేశ్వరరెడ్డి, కపలవాయి విజయ్ కుమార్, బి.విశ్వేశ్వరరావు, వాసిరెడ్డి రవీంద్ర, వైద్యశాల సిబ్బంది కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ రేట్లకే గ్యాస్‌ను వినియోగదారులకు అందించాలి

● తహసీల్దార్ సురేష్

వినుకొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ డోర్ డెలవరీ సమయంలో ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక రేట్లు వసూలు చేస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ సురేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినుకొండ పరిధిలోని ఏడు గ్యాస్ ఏజెన్సీ యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు గ్యాస్ బుక్‌చేసుకున్న వెంటనే గ్యాస్‌ను అందించాలన్నారు. వినియోగదారులకు అందించే గ్యాస్‌ను వ్యాపారులకు విక్రయించరాదని, కేవలం వ్యాపారులకోసం కేటాయించిన 19 కేజీల సిలిండర్ మాత్రమే అందించాలని, 19 కేజీల సిలిండర్‌కు బదులు 14 కేజీల సిలిండర్ ఎక్కడైనా హోటల్, టిఫెన్ బండ్లు వద్ద ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో కే-రిడ్జి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏరోస్కేట్బాల్ అసోసియేషన్ మహారాష్ట్ర జనవరి 11, 12 తేదీలలో నిర్వహించిన పదో జాతీయస్థాయి అండర్-14 స్కేటింగ్ పోటీలలో కే-రిడ్జి విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జీ బర్నబాస్ సోమవారం తెలియజేశారు. కర్లం కార్తికేయ ప్రథమ బహుమతి, నందిపాటి మోక్షిత్, షేక్ మొహమ్మద్ వహీద్, కాకర్ల మోక్షరామ్‌చరణ్‌లు తృతీయ బహుమతులు సాధించారు. విద్యార్థులను, స్కేటింగ్ కోచ్ ఫిరోజ్‌ఖాన్‌ని స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ పుట్ట హేమంత్, పీడీ కిషోర్ అభినందించారు.

సోషల్ ఆడిట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి: ఎస్‌ఆర్‌పీ

నూజెండ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సోషల్ ఆడిట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్ఆర్‌పీ రాజు అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31వరకు జరిగిన ఉపాధి హామీ, పాఠశాల మధ్యాహ్న భోజనం పథకాల అమలును సోషల్ ఆడిట్ బృందాలు సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ రాజు మాట్లాడుతూ రాజకీయ ఒత్తిడులకు, ప్రలోభాలకు తావు ఇవ్వకుండా సామాజిక తనిఖీ నిర్వహించే వారిని బృందాల్లో సభ్యులుగా చేర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఏఈ అల్లాభక్షు, హౌసింగ్ ఏఈ నరేంద్ర, ఏపీవోలు ఆంజనేయరాజు, కే నాగేశ్వరరావు, ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ విజేతలు తెల్లబాడు జట్టు



విజేతలుగా నిలిచిన తెల్లబాడు జట్టు

నూజెండ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన తెల్లబాడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు సోమవారం జరిగాయి. ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొనగా తెల్లబాడు జట్టు విజేతగా నిలిచింది. రెండవ స్థానంలో పాత ఉప్పలపాడు జట్టు నిలిచింది. బహుమతులను దారం అంజిరెడ్డి, దార్నాసి హనుమంతరావులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు సుబ్బారావు, ప్రసాదు, విష్ణు, ఆంజనేయులు, హనుమంతరావు, ఆదినారాయణ, సలేము, రాజు, నాగరాజు, దేవరాజు, అజయ్, అజయ్ రాజు, దుర్గారావు, మహేష్, వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తాపడి ఒకరికి తీవ్ర గాయాలు

యడ్లపాడు, జనవరి 20 (ఆంధ్రజోతి): పదహారో నంబరు జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. దొనకొండకు చెందిన ఎస్ బాలఉగ్ర కుటుంబ సభ్యులతో ఆదివారం తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలులోని కోటి సత్తెమ్మ దేవాలయానికి మొక్కు తీర్చుకునేందుకు కారులో వెళ్ళారు. మొక్కు తీర్చుకుని సోమవారం తిరిగివస్తుండగా యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలోని జాతీయరహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌పై బోల్తా పడింది. దీంతో కారు నడుపుతున్న బాలఉగ్ర తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన బాలఉగ్రను 108వాహనంలో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని విచారిస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో.. ఒకరికి గాయాలు

రొంపిచర్ల, జనవరి 20 (ఆంధ్రజోతి): మండలంలోని రెడ్డిపాలెం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న సంఘటన సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. కుంకలగుంట నుంచి నకరికల్లు మండలం డెయిరీకి పాల లోడుతో వెళ్తున్న ఆటో కుంకలగుంటకు చెందిన వ్యక్తి నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడికి గాయాలవ్వటంతో నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఒకటవ డివిజన్ పారిశుధ్య కార్యాలయం వద్ద సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. రెండో డివిజన్ పరిధిలోని చంద్రమౌళి కూరగాయల మార్కెట్, చికెన్ షాపులు, చేపల మార్కెట్ ప్రాంతాలలో తిరిగి పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌ను సందర్శించి పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్వహణను పరిశీలించారు. స్థానిక చీరాల రోడ్డు, పెదనందిపాడు రోడ్డు తదితర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను, పెదనందిపాడు రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు.

మునిసిపల్ చైర్‌పర్సన్ రఫానికి ప్రత్తిపాటి పరామర్శ

చిలకలూరిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్స చేయించుకున్న చిలకలూరిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ రఫానిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పరామర్శించారు. సోమవారం రహమత్ నగర్‌లోని రఫాని ఇంటివద్ద కలసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కుష్ఠువ్యాధి లక్షణాలుంటే చికిత్స పొందాలి

● ఇన్‌చార్జి వైద్యాధికారి అజిత

శావల్యాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి లక్షణాలున్నవారు ప్రాథమిక దశలోనే చికిత్సలు పొందడం వల్ల వ్యాధిని త్వరితగతిన నివారించవచ్చని ఇన్‌చార్జి వైద్యాధికారి అజిత అన్నారు. కుష్ఠువ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వేలో భాగంగా మండలంలోని 11సచివాలయాల పరిధిలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు సోమవారం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కుష్ఠువ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించి అనుమానితులను గుర్తించారు. శావల్యాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సెంటర్ వరకు వైద్యసిబ్బంది కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్స్ ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ సీతారామయ్య, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● నూజెండ్ల: కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రమైన నూజెండ్లలో సోమవారం ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాలకొండయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీ వరకు వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్ళి కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రభాకరరెడ్డి, సీహెచ్‌వో విమలకుమారి, పీహెచ్‌ఎన్ గోవిందమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ వరప్రసాదు, శాంత కుమారి, జడ్పీ పాఠశాల పీడీ నిడమానూరి వెంకటరత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించిన ప్రత్తిపాటి

రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

చిలకలూరిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను సోమవారం స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను విధిగా పాటించాలని, యువత ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయడం ఎంతమాత్రం మంచిది కాదన్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలు తీసుకొని వాహనాలు నడపడం క్షమించరాని నేరమన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్ బెల్టులు పెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా, భద్రతా నిబంధనలు ప్రజలకు తెలియచేస్తూ ఆటో, జీప్ డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీఎల్‌రావు, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్ ఖాన్, జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, ఎస్ఎస్ సుభాని, మద్దుమాల రవి పాల్గొన్నారు.

దేవాలయం, ఘాట్ రోడ్డును పూర్తి చేస్తాం

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వినుకొండ కొండపై రామలింగేశ్వరస్వామి దేవాలయంతోపాటు ఘాట్‌రోడ్డు పూర్తిచేసి వినుకొండ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో ఘాట్‌రోడ్డు పూర్తిచేసేందుకు పాత కమిటీ, ఔత్సాహికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘాట్‌రోడ్డుతోపాటు దేవాలయం నిర్మించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులను అందించారని, నిర్మాణాలు పూర్తయ్యేవరకు అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2018 డిసెంబరు 30 రామలింగేశ్వరస్వామి ఘాట్‌రోడ్డు కమిటీ పనులు ప్రారంభించిందని, వాటిని కొనసాగిస్తూ ప్రభుత్వ సహకారం అందిస్తూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం బొల్లాపల్లి, ఈపూరు మండలంలోని జొన్నలగడ్డ పేరమ్మ, బచ్చనబోయిన వెంకటేశ్వర్లు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చేతులమీదుగా పంపిణీచేశారు.

సర్వేలు త్వరితగతిన పూర్తిచేయాలి: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలు త్వరితగతంగా పూర్తిచేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యలయంలోని యస్.ఆర్.శంకరన్ హాలులో మండల, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న సర్వేలలో వెనుకబడి ఉన్న మండలాల వారు సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో హౌసింగ్‌కు సంబంధించి మండలాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు 426 ఉండగా వాటిలో 157 పాక్షికంగా పనిచేస్తుండగా, 256 పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, 19 కేంద్రాలు అసలు ప్రారంభం కాలేదన్నారు. కాగా వీటిని ఫిబ్రవరి 15 నాటికి ఈ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 21 నుంచి 25 వరకు ప్రత్యేక అధార్ కేంద్రాలు అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించి, 0 నుంచి 6 సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారని, వీటిని సద్వినియోగపర్చుకునేలా చూడాలన్నారు. కార్యక్రమం ప్రతి నెల 5 రోజులపాటు జరుగుతుందన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం త్వరితగతిన చేయాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు బాలునాయక్, భాస్కరరెడ్డి, మురళి, కుముదిని, సంజీవరావు, ఆంజనేయులు, భానుకీర్తి, సుబ్బారాయుడు, సిద్ధలింగమూర్తి, తమ్మాజీరావు పాల్గొన్నారు.


కాలువలో గల్లంతైన వృద్ధుని మృతదేహం లభ్యం



చిన్నమల్లయ్య (ఫైల్‌ఫోటో)

కారుమంచి (శావల్యాపురం) జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అద్దంకి బ్రాంచ్ కాలువలో పడి గల్లంతైన శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన బొల్లేపల్లి చినమల్లయ్య (73) మృతదేహం సోమవారం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 16వ తేదీన పొలానికి వెళుతున్నానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటినుండి బయటకు వెళ్ళిన చిన్నమల్లయ్య సాయంత్రమైనా ఇంటికి రాలేదు. బాధితుని భార్య భారతమ్మ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. బాపట్ల జిల్లా మక్కెనవారిపాలెం సమీపంలో మేజర్ కాలువలో శవం ఉన్నట్లుగా ఆచూకీ తెలియడంతో వెళ్ళిచూడగా అది చిన్నమల్లయ్య మృతదేహంగా గుర్తించారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ నీటిప్రవాహంలో కొట్టుకొని వెళ్ళిన చిన్నమల్లయ్య మృతదేహం మక్కెనవారిపాలెం మేజర్ కాలువలో నుంచి వెళ్లినట్లుగా పోలీసులు గుర్తించారు. మృతుడు చిన్నమల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటోను ఢీ కొన్న లారీ.. ఒకరు మృతి



మృతి చెందిన ఎస్‌కే జానీ బాషా

నరసరావుపేట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం ఉప్పలపాడు వద్ద ఆటోను లారీ ఢీకొన్న సంఘటన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో నరసరావుపేట మండలం యలమందల గ్రామానికి చెందిన ఎస్‌కే జానీబాషా (48) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ కిషోర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

దీవి రామబ్రహ్మంకు గౌరవ డాక్టరేట్



దీవి రామబ్రహ్మం

చిలకలూరిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభానీనగర్‌కు చెందిన సాహితీవేత్త దీవి రామబ్రహ్మంకు గౌరవ డాక్టరేట్ లభించింది. తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ వారు రామబ్రహ్మం చేసిన సాహితీ కృషికి గాను విజయవాడలో జరిగిన ఓ సాహితీ కార్యక్రమంలో ఆదివారం ఈ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. రామబ్రహ్మం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. రామబ్రహ్మంకు గౌరవ డాక్టరేట్ లభించడంపై పట్టణంలోని సాహితీవేత్తలు, కళాకారులు, పీవీ సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, డా విన్సెంట్ పాల్, ఏవీ శివయ్య, బుదాటి కోటయ్య, తదితరులు అభినందనలు తెలిపారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి: ఎంపీడీవో

ఈపూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రతి వలంటీర్ కృషి చేయాలని ఎంపీడీవో కే ప్రభాకరరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో సోమవారం సమాజంలో అందరికి జీవితకాల అభ్యసనం అవగాహనపై ఉల్లాస్ కార్యక్రమంను ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 నుంచి 60 సంవత్సరాల లోపు చదువుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందుకోసం ప్రతి గ్రామంలో పది మందికి ఒక వలంటీర్‌ను నియమించి ఒక గంట వారికి చదువు చెప్పేలా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమానికి ఎంపీడీవో ఉల్లాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం పీవీ రంగారెడ్డి, సీసీలు, వీవోఏలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.